సాక్షి
తిరుపతి
మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024



జగనన్నతోనే సంక్షేమాభివృద్ధి

సీఎం జగనన్నతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. - 8లో



వైఎస్సార్‌సీపీలో చేరిక

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పలువురు టీడీపీ కార్యకర్తలు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. - 8లో



ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయి. ఈనెల 15 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 70,679 మంది స్వామివారిని దర్శించుకోగా, 21,717 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.36 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న డీఆర్వో పెంచల కిషోర్

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో అధికారులు బాధ్యతగా పనిచేయాలని డీఆర్వో పెంచలకిషోర్ సూచించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వివిధ శాఖల నోడల్ అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించడం ఎంతో కీలకమని, పొరబాట్లకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

పోలీస్ స్పందనకు 53 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 53 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నట్టు ఆయన వెల్లడించారు. వెంటనే ఫిర్యాదులు పరిష్కారమయ్యే విధంగా చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు 2023–2024కు సంబంధించి పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5గంటల వరకు గడువును ఇంటర్ బోర్డు పొడిగించినట్లు ఆర్ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు ఫీజు చెల్లించని ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర జనరల్, ఒకేషనల్, ప్రైవేటు విద్యార్థులు రూ.3 వేలు అపరాధ రుసుముతో పరీక్ష ఫీజును చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులకు సమాచారం అందించి చర్యలు తీసుకోవాలని ఆర్ఐఓ కోరారు.

స్పందనలో మార్పులు



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్: స్పందనలో మార్పులు చేస్తూ కలెక్టర్ లక్ష్మీశ నిర్ణయం తీసుకున్నారు. ప్రతి అర్జీదారుడు అధికారుల ఎదుట కూర్చొని సమస్య వివరించే విధంగా చర్యలు చేపట్టారు. అలాగే కలెక్టరేట్ వరండాలోకి టోకెన్ కౌంటర్, అర్జీల కౌంట్‌ను మార్పు చేశారు. స్పందన వద్ద అర్జీలను ఆన్‌లైన్ చేయడం, అధికారులు పరిశీలించి వారితో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపడం ఈ రెండు కార్యక్రమాలు మాత్రమే ఉండేలా జాగ్రత్తలు చేపట్టారు.

స్పందనకు 201 అర్జీలు

కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 201 అర్జీలు వచ్చాయి. అందులో అత్యధికంగా రెవెన్యూ విభాగానికి చెందినవి 153 అలర్జీలున్నట్టు కలెక్టర్ తెలిపారు. అనంతరం స్పందన అర్జీల ఆన్‌లైన్ కౌంటన్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట జేసీ శుభం భన్సల్, డీఆర్వో తోపాటు ఎస్‌డీసీలు శ్రీనివాసులు, చంద్రశేఖర్‌నాయుడు, లాంగ్ ప్రోటోకాల్ సెల్ రామ్మోహన్, ట్రైనీ డెప్యూటీ కలెక్టర్లు ఐశా, పావని ఉన్నారు.



పునీత్, కన్నయ్య మృతదేహాల వద్ద గుండెలవిసేలా రోదిస్తున్న బంధువులు (ఇన్‌సెట్) పునీత్, కన్నయ్య మృతదేహాలు



ఆశలు మునిగె.. శోకం మిగిలె!

ఒకే గ్రామానికి చెందిన ముక్కుపచ్చలారని పిల్లలు. బుడిబుడి అడుగులుతో ఊరంతా సందడి చేసేవారు. ఒకే పాఠశాలలో చదువుతూ స్నేహితులుగా మారిపోయారు. ఉపాధ్యాయుల సహకారంతో బడి నుంచి ఇంటికొచ్చే వారు. సోమవారం పాఠశాల నుంచి వస్తూ మార్గమధ్యంలో ఉన్న కుంటలో సరదాగా ఈత కొట్టాలని భావించారు. గట్టున దుస్తులు పెట్టి నీటిలో దిగి ఊపిరాడక మృత్యు ఒడిలోకి వెళ్లిపోయారు. కన్నతల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చారు. మరో ఘటనలో తల్లీకూతుళ్లు బర్రెలు గట్టుకు తోలడాలని చెరువులో దిగి మృత్యువాత పడ్డారు. జిల్లాలో ఒకే రోజు వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృతిచెందడం ఆయా గ్రామాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది.

జిల్లాలో నీటమునిగి ఐదుగురి మృతి

- పాకాలలో ఈతకెళ్లి ముగ్గురు చిన్నారులు మృత్యువాత
- శ్రీకాళహస్తిలో చెరువులో దిగి మునిగిపోయిన తల్లీకూతుళ్లు
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబీకులు



తీసుకెళ్లావా.. దేవుడా!

పాకాల/ శ్రీకాళహస్తి: జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. వేర్వేరు చోట్ల నీటమునిగి ఐదుగురు మృత్యువాత పడ్డారు. ఇందులో ఈత కోసం వెళ్లి ముగ్గురు చిన్నారులు మృతిచెందగా.. బర్రెలను బయట తోలేందుకు చెరువులోకి దిగి తల్లీకూతుళ్లు మృతిచెందారు. ఈ ఘటన ఆయా కుటుంబీకుల్లో పెను విషాదాన్ని మిగిల్చింది.

ఈత..గుండె కోత

చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం, ఊటువంక గ్రామానికి చెందిన రామకృష్ణ, విజయలక్ష్మి దంపతులు నిరుపేదలు. కూలికెళ్లి పొట్టపోసుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులుండగా.. పెద్దవాడు ఎల్.పునీత్(10), ద్వితీయ కుమారుడు ఎల్.కన్నయ్య(9) స్థానిక పాఠశాలలో 5, 4 తరగతులు చదువుతున్నారు. అలాగే అదే గ్రామానికి చెందిన ఎస్.శేఖర్, ఎస్.జ్యోతి కుమారుడు ఎస్.తేజేశ్వర్(8) అదే పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నారు. వీరు ముగ్గురూ స్నేహితులు. ఎస్.తేజేశ్వర్ బుద్ధిమాంద్యంతో బాధపడుతున్నాడు. ప్రభుత్వం విద్యార్థికి ప్రత్యేక ప్రతిభావంతుల కింద నెలకు రూ.3 వేలు పింఛన్ అందజేస్తోంది. సోమవారం సాయంత్రం పాఠశాల ముగిసిన వెంటనే ఆడుకుంటూ సమీపంలోని కుంట వద్దకు చేరుకున్నారు. ఈత కొట్టాలనే ఉద్దేశంతో బట్టలు విప్పి గట్టుమీద పెట్టి కుంటలోకి దిగారు. లోతు ఎక్కువగా ఉండడం.. ఈత రాకపోవడంతో నీటమునిగిపోయారు. సాయంత్రం వరకు చిన్నారులు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. స్థానికులను వెంటతీసుకుని కుంటవద్దకెళ్లగా అక్కడ గట్టుపై దుస్తులు కనిపించాయి. ఆపై గుంటలోకి దిగి గాలించగా చిన్నారుల మృతదేహాలు లభ్యమయ్యాయి. విషయం తెలుసుకున్న సీఐ రాజగోపాల్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదవశాత్తు కుంటలోకి దిగి మృతిచెందారని తెలిపారు. గ్రామంలో ముగ్గురు చిన్నారులు మృతిచెందడంతో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కలచివేసింది.

గ్రామంలో అలముకున్న విషాద ఛాయలు

ఒకే గ్రామంలో ముగ్గురు చిన్నారులు మృత్యువాత పడడంతో ఊటువంక గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. చిన్నారులు బాగా చదువుకుని తమ కష్టాలను గట్టెక్కిస్తారని ఆశతో ఉన్న తల్లిదండ్రులకు నిరాసే మిగిలింది. పేదరికంలో ఉన్నా పిల్లలను ఉన్నత స్థాయికి చేర్చాలనే దృఢ సంకల్పంతో కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నారు. కాలం చిన్న చూపు చూసి విధి వంచించడంతో చిన్నారులను మృత్యువ కబలించింది. గ్రామంలోని ప్రతీ ఒక్కరు చిన్నారుల మృతదేహాల వద్ద రోదిస్తున్నారు. విషయం తెలుసుకున్న మండలంలోని ప్రతీ ఒక్కరు ఊటువంక చేరుకుని చిన్నారుల తల్లిదండ్రులు చేస్తున్న ఆర్తనాదాలను చూసి కంట తడి పెట్టారు.



ఊటువంకలో గుమికూడిన జనం



రత్నమ్మ మృతదేహం వద్ద రోదిస్తున్న కుమారుడు



తేజేశ్వర్ మృతదేహం(ఇన్‌సెట్) తేజేశ్వర్(ఫైల్)

బర్రెల కోసం చెరువులోకి దిగి..!



తల్లి రత్నమ్మ(ఫైల్)



కుమార్తె మునిరత్నమ్మ(ఫైల్)

చెరువులోని బర్రెలను బయటకు తోలుకొచ్చేందుకు నీటిలో దిగి ప్రమాదవశాత్తు తల్లీకూతుళ్లు మృతిచెందారు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం, ముచ్చివోలులో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. ముచ్చివోలు గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యులు శంకరయ్య భార్య రత్నమ్మ(62), ఆమె కుమార్తె మునిరత్నమ్మ(35)తో కలిసి బర్రెలను మేపడానికి ముచ్చివోలు చెరువు వద్దకు తోలుకెళ్లారు. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉండడంతో సేదతీరుతాయని బర్రెలను చెరువులో తోలారు. ఎంతకీ బయటకు రాకపోవడంతో బర్రెలను తోలుకొచ్చేందుకు సిద్ధమయ్యారు. ముందుగా తల్లి రత్నమ్మ చెరువులో దిగి మునిగిపోతుండడంతో కూతురు మునిరత్నమ్మ చెరువులో దిగి తల్లిని రక్షించేందుకు ప్రయత్నించారు. ఆపై ఇద్దరూ ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడ్డారు. సాయంత్రం అవుతున్నా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చెరువు వద్దకు వెళ్లి వెతకగా తల్లీకూతుళ్లు నీటిలో విగతజీవులుగా కనిపించారు. మునిరత్నమ్మకు భర్త, చిన్నపిల్లలైన కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృత్యువాత పడడం గ్రామంలో విషాదం మిగిల్చింది.

రా 'బలవంతంగా' కదలి రా!

సభలు నిర్వహించేందుకు ముందుకు రాని నాయకులు.. బాబు జిమ్మిక్కులకు మళ్లీ మోసపోతామేమోనన్న మీమాంసలో టీడీపీ ఆశావహులు.. టిక్కెట్ రాకముందే ఉన్నది ఊడ్చిపెడితే తర్వాత పరిస్థితేంటన్న మీమాంసలో ముఖ్యనేతలు.. వెరసి! రా..కదలిరా.. సభలు జనం లేక వెలవెలబోతున్నాయి. అభ్యర్థులను ప్రకటించకముందే సభలు పూర్తిచేయాలన్న వ్యూహంలో ఉన్న బాబు పన్నాగానికి అడుగడుగునా అడ్డంకులే ఎదురవుతున్నాయి. ఇప్పుడు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇలాంటి పరిస్థితే ఎదురవుతోంది. సొంత జిల్లాలో సభ నిర్వహించకపోతే పరువుపోతుందని భావించిన చంద్రబాబు కల్లబొల్లి మాటలతో నేతలను పురమాయించినా ఎవ్వరూ ముందుకు రాకపోవడం విశేషం.

- రా కదలి రా! సభ నిర్వహణకు ముందుకు రాని టీడీపీ నేతలు
- సొంత జిల్లాలో పెట్టేందుకు ముప్పతిప్పలు
- నెల రోజులుగా పలుమార్లు నాయకులతో బాబు చర్చలు
- థామస్‌ని బలవంతంగా ఒప్పించిన సీనియర్ నేతలు
- నేడు గంగాధరనెల్లూరులో 'రా కదలిరా సభ'
- జన సమీకరణకు తమ్ముళ్ల పాట్లు



సాక్షి, తిరుపతి: ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ బలనిరూపణకు దిగింది. అందులో భాగంగా జిల్లాకు ఒక భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. అభ్యర్థులను ప్రకటించకముందే సభలు నిర్వహిస్తే సక్సెస్ అవుతామని చంద్రబాబు ప్రణాళిక రచించారు. అందులో భాగంగానే అభ్యర్థులను ప్రకటించకముందే రా కదలి రా సభలు పూర్తి చేయాలని భావించారు. టిక్కెట్ ఆశించే వారు తమ బలాన్ని నిరూపించుకునేందుకు ఎవరికి వారు పోటీపడి సభలకు జనాలను తీసుకొస్తారని బాబు పన్నాగం పన్నారు. అయితే ఆయన కుట్రపూరిత ప్రణాళికను గ్రహించిన ఆశావహులు ఎక్కడికక్కడ మొహం చాటేస్తూ వస్తున్నారు. ఫలితంగా రా కదలిరా సభలు జనం లేక వెలవెలబోతున్నాయి.

ముందుకుతోసి.. తప్పుకుంటున్నారు

సభ నిర్వహించేందుకు అతికష్టంపై ఒప్పుకున్న థామస్‌పై టీడీపీ నేతలు మరింత భారం మోపినట్లు తెలుస్తోంది. తన శక్తి కొద్దీ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన భావించారు. అయితే మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి 2 లక్షల మందితో సభ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. మాజీ మంత్రి ప్రకటనతో థామస్ షాక్ గురయ్యారు. ఐదువేల మంది వస్తేనే ఎక్కువ అని, అటువంటిది రెండు లక్షల మందిని ఎక్కడి నుంచి తీసుకురావాలి? అని ప్రశ్నించినట్లు తెలిసింది. జనానికి ఒక్కొక్కరికీ కనీసం రూ.200 అయినా ఇవ్వకపోతే రారని తేల్చిచెప్పారు. అంత ఖర్చు తన వల్ల కాదని చేతులెత్తేసినట్లు తెలిసింది. ముందు ఒప్పిస్తే.. పరువు కోసమైనా సభ నిర్వహించక తప్పదు కదా? అనే ఆలోచనతో థామస్‌ని ముందుకు తోసినట్లు ప్రచారం జరుగుతోంది. సభ నిర్వహణ కోసం థామస్ ఇప్పటికే రూ.5 కోట్ల వరకు ఖర్చుచేసినట్లు విశ్వసనీయ సమాచారం. రా కదలి రా సభ పేరుతో తన ఒంటి మీద ఉన్న బట్టలన్నీ విప్పించేస్తున్నారంటూ థామస్ తన అనుచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు గంగాధరనెల్లూరులో టీడీపీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉంటే.. జన సమీకరణ బాధ్యతలు అన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు అప్పగించినట్లు తెలిసింది. చంద్రబాబు సభకు జనం వెళ్లేందుకు ఆసక్తి చూపించడంలేదని సమాచారం. దీంతో ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు జనం రావడానికి ఇష్ట పడడంలేదని చెప్పి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గంగాధరనెల్లూరు నియోజకవర్గ పరిధిలోని జనాన్నే తరలించమని చెప్పండంటూ టీడీపీ నేతలు తప్పించుకున్నట్లు సమాచారం.

చేతులెత్తేశారు

తిరుపతి జిల్లా, వెంకటగిరిలో ఇటీవలే నిర్వహించిన రా కదలిరా సభ అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. ఇక చిత్తూరు జిల్లాలో అయినా భారీ ఎత్తున నిర్వహించి పరువు కాపాడుకోవాలని చంద్రబాబు అండ్ కో తాపత్రయపడ్డారు. ఇందులో భాగంగానే ముందుగా నగరిలో నిర్వహించాలని అనుకున్నా.. అక్కడ గాలిభాను తన వల్ల కాదని చేతులెత్తేశారు. చిత్తూరులోఎవ్వరూ ముందుకు రాకపోవడం.. పూతలపట్టులో ఖర్చు పెట్టుకోలేమని చెప్పడం.. పుంగనూరులో అయితే కచ్చితంగా షో ఫ్లాప్ అవుతుందని భయపడ్డారు. పలమనేరులో మాజీ మంత్రి సుముఖంగా లేరు. ఇలా అన్ని చోట్లా ప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేకపోయింది. సొంత జిల్లాలో రా కదలి రా సభ నిర్వహించకపోతే పరువు పోతుందని గంగాధరనెల్లూరులో పెట్టాలని నిర్ణయించారు. అయితే అభ్యర్థి ఎవరనేది ఖరారుకాకనే ఎవరికి బాధ్యతలు అప్పగించాలో తెలియక ఆ పార్టీ నేతలు మల్లగుల్లాలు పడ్డారు. చివరకు థామస్‌ని అడిగితే పెత్తనం ఒకరిది, ఖర్చు నాకా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. సభ పెట్టి సక్సెస్ చేస్తే టికెట్ నీకే అని బలవంతంగా ఒప్పించినట్లు సమాచారం.

భక్తిని చాటేలా శ్రీనివాస కల్యాణం



ధార్మిక సదస్సులో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

- ధార్మిక సదస్సులో స్వామీజీల అనుగ్రహ భాషణం

తిరుమల: తిరుమలలో శ్రీనివాస కల్యాణం ద్వారా అందరికీ భక్తిని చాటేలా ప్రచారం చేస్తున్నారని స్వామీజీలు తెలిపారు. తిరుమల ఆస్థాన మండపంలో మూడు రోజుల పాటు జరిగిన శ్రీవేంకటేశ్వర ధార్మిక సదస్సు సోమవారం ముగిసింది. చివరి రోజు పలువురు స్వామీజీలు అనుగ్రహ భాషణం చేశారు. ఉడిపి మఠానికి చెందిన వేదవర్ధన స్వామి ప్రసంగిస్తూ.. చిన్నపిల్లలకు భగవంతుని పట్ల అవగాహన కల్పించేందుకు ప్రతి ఊరిలో వారానికి ఒకసారి ప్రవచనాలు, ప్రార్థన గురించి తెలపాలన్నారు. పాండరికపురం ఆశ్రమం, శ్రీరంగం.. పరవకొట్టై చిన్న ఆండవన్ శ్రీనివాస గోపాల మహాదేశికన్ స్వామి అనుగ్రహభాషణం చేస్తూ.. శ్రీనివాస కల్యాణం ద్వారా అందరికీ భక్తిని చాటేలా చేస్తున్నట్టు వెల్లడించారు. పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలకు నైతిక పోటీలు నిర్వహించాలని చెప్పారు. చిత్రాపూర్ మఠం, కర్ణాటక విద్యేంద్ర తీర్థ స్వామీజీ మాట్లాడుతూ ధర్మాన్ని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందన్నారు. సదాశివ ఆశ్రమ స్వామీజీ, శృంగేరి బ్రహ్మానంద మఠం, వారణాసి.. శ్రీవిష్ణుసహస్ర నామ పారాయణం, సంస్కృత సుభాషితాలు ప్రత్యేకంగా బోధించాలన్నారు. సువిద్యేంద్ర తీర్థ స్వామి, రాఘవేంద్ర మఠం, బెంగళూరు ప్రసంగిస్తూ.. ప్రతి గ్రామంలో దేవాలయాలు నిర్మించాలన్నారు.

పీసీసీఎస్ మొబైల్ యాప్ ప్రారంభం



యాప్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైమ్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి పీసీసీఎస్(పోలీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ) మొబైల్ యాప్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ యాప్‌ను తయారు చేసినట్టు వెల్లడించారు. దీని ద్వారా 1,708 మంది పోలీసులు సేవలు పొందనున్నట్టు వెల్లడించారు. ఏఎస్పీ లు వెంకటరావు, కులశేఖర్, విమలకుమారి, శివరాంరెడ్డి పాల్గొన్నారు.



రాపూరులో రాధాకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అసత్యాలపై భగ్గుమన్న ప్రజలు

రాపూరు: అసత్య ప్రచారంపై ప్రజలు భగ్గుమన్నారు. రాపూరు వైఎస్సార్‌సీపీ నాయ కులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి 400 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమించారంటూ ఏబీఎన్ రాధాకృష్ణ ప్రచారం చేయడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రాపూరు, పెనుబర్తి గ్రామాల్లో రాధాకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేసి, నిరసన వ్యక్తం చేశారు. జేసీఎస్ కన్వీనర్ లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ మండలంలోని పంగిలి గ్రామంలో సర్వే నం.136లో 400 ఎకరాల భూమి ఆక్రమించారంటూ అసత్య ప్రచారం చేయడం తగదన్నారు. 40 సంవత్సరాల రాజకీయ చరిత్ర ఉన్న పాపకన్ను కుటుంబం ఏనాడూ ఆక్రమణలకు పాల్పడిన దాఖలాలులేవన్నారు. ఆ కుటుంబంపై ప్రజలకు ఎంతో గౌరవం ఉందన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలతో వారి మనోభావాలు దెబ్బతీయడం దుర్మార్గమని ధ్వజమెత్తా రు. అంతకముందు పెనుబర్తి గ్రామంలోని జాతీయ రహదారిపై వైఎస్సార్‌సీపీ నాయకులు లీలామోహన్‌రెడి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రాధాకృష్ణ దిష్టి బొమ్మను దహనం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మురళీమోహన్‌రెడ్డి, డాక్టర్ ఖాదర్‌బాషా, ఘని, వరబాబు, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, సలామ్, కృష్ణారెడ్డి, ఆదిరెడ్డి, అశోక్, మధు పాల్గొన్నారు.

కర్రసాము చాంపియన్ పోటీల్లో పేట క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

నాయుడుపేట టౌన్: సౌత్ ఇండియా ఒకటో కర్రసాము చాంపియన్ షిప్–2024 పోటీల్లో నాయుడుపేట క్రీడాకారులు ప్రతిభ చూపి, పతకాలు సాధించినట్లు తిరుపతి జిల్లా కర్రసాము అసోసియేషన్ సభ్యుడు పవన్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నెల్లూరులో ఆదివారం నిర్వహించిన కర్రసాము చాంపియన్ షిప్– 2024 పోటీల్లో నాయుడుపేటకు చెందిన ఏ.మహిత, టీ మనోజ్, కే.భవానీ ప్రసాద్, జీ.చక్రధర్, శ్రీవిద్య, ప్రసన్నకుమార్ పాల్గొని, ప్రథమ బహుమతి సాధించారన్నారు. అలాగే కే.కోవిద్, కోమలేశ్వర్, కే.భవ్య, ద్వితీయ బహుమతి, ఎం.సహస్ర, కే.హర్ష, చిత్రాక్షి, సింగ్, పీ.చరణ్, శ్రీసాయి, అఖిర తృతీయ బహుమతి సాధించినట్లు వెల్లడించారు. క్రీడాకారులు కర్రసాము ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ శ్రీహరి, ప్రధాన కార్యదర్శి జీ.శ్రీనివాసులు చేతుల మీదుగా పతకాలు అందుకున్నట్టు ఆయన వెల్లడించారు.

జగనన్నతోనే సంక్షేమాభివృద్ధి



మిట్టపాళెం పంచాయతీలో మాట్లాడుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



సభకు వెల్లువెత్తిన జనసందోహం

- 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం
- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- చంద్రగిరిలో కొనసాగుతున్న 'వైఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం

తిరుపతి రూరల్/చంద్రగిరి: రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త మోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. చంద్రగిరి మండలంలో జరుగుతున్న 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో భాగంగా మూడో రోజు సోమవారం రామిరెడ్డిపల్లి, నరసింగాపురం, మిట్టపాళెం, శానంబట్ల పంచాయతీల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డికి ఆయా పంచాయతీల ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. గజమాలలతో ఆత్మీయంగా సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు. అంతకుముందు ఆయా పంచాయతీల పరిధిలో పార్టీ జెండాలు, సభా ప్రాంగణంలో అభివృద్ధి, సంక్షేమ బోర్డ్‌ను మోహిత్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించి, అందులో చాలాసమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలిచ్చారు.

జగనన్నతోనే పేదలకు ఆర్థిక భరోసా

సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే చేర్చుతూ పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ప్రజాసంక్షేమసారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి కొనియాడారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి ఇచ్చిన హామీలను 99 శాతం మేర అమలు చేశారని గుర్తుచేశారు. పెన్షన్‌లు, అమ్మ ఒడి, జగనన్న చేయూత, ఆసరా, రైతు భరోసా వంటివి అమలు జరగాలంటే ఆంధ్రప్రదేశ్‌కు జగనే సీఎం కావాలని స్పష్టం చేశారు. కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్యపెట్టడానికి వస్తున్న పార్టీలను నమ్మొద్దని హితవు పలికారు. జగనన్న ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా మహిళా సంఘాలకు రూ.25 వేల కోట్ల మేర రుణాన్ని 4 విడతలుగా మాఫీ చేశారని గుర్తుచేశారు.

ఆదర్శంగా చంద్రగిరి అభివృద్ధి

ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోనే ఆదర్శంగా చంద్రగిరి నియోజకవర్గంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మోహిత్‌రెడ్డి వెల్లడించారు. కులం, మతం, వర్గం, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందజేసినట్టు తెలిపారు. అంతేకాకుండా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వ్యక్తిగతంగా చేసిన సాయం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. ప్రాణాంతకమైన కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవ చేశారని గుర్తుచేశారు. యువత కోసం జాబ్‌మేళాలు నిర్వహించడం, క్రీడా స్ఫూర్తిని నింపేందుకు క్రికెట్ టోర్నమెంట్‌లు, వివాహ కానుకలు, పండుగ సందర్భాలలో కానుకలు, ఆరోగ్య పరిరక్షణకు హెల్త్ క్యాంప్‌లు నిర్వహించినట్టు వెల్లడించారు. తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాసేవలో తరిస్తానని మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. అనంతరం ఆత్మీయ విందును ఆయన ప్రారంభించారు.

పంచాయతీల్లో అభివృద్ధి ఇలా..

- రామిరెడ్డిపల్లి పంచాయతీలో రూ.5.12 కోట్లతో 240 అభివృద్ధి పనులు చేపట్టారు. సంక్షేమ పథకాల కింద రూ.20.31 కోట్లు పంపిణీ చేశారు. ఒక్క పెన్షన్ కానుక కిందే 539 మందికి రూ.5.99 కోట్లు అందజేశారు. ఆసరా పథకం కింద రూ.2.44 కోట్లు పంపిణీ చేశారు.
- నరసింగాపురం పంచాయతీలో రూ.4.7 కోట్లతో అభివృద్ధి పనులు, రూ.20 కోట్ల సంక్షేమ నిధులు అందజేశారు.
- మిట్ట పాళెం పంచాయతీలో రూ.4.27 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా, రూ.17.47 కోట్ల సంక్షేమ నిధులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.
- శానంబట్ల పంచాయతీలో రూ.8.71 కోట్ల అభివృద్ధి పనులు.. సంక్షేమ పథకాల ద్వారా రూ.18.40 కోట్లు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, ఐతేపల్లి సింగిల్ విండో అధ్యక్షురాలు వరలక్ష్మి, ఎంపీటీసీ బోస్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మస్తాన్, దేవారెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



నవరత్నాల ముగ్గుతో అపూర్వ స్వాగతం



మోహిత్‌రెడ్డిని సత్కరిస్తున్న రామిరెడ్డిగారిపల్లి యూత్



ఆసరా చెక్కు అందిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ కార్యకర్తలకు కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని ముసిలిపేడు, నచ్చనేరి గ్రామాలకు చెందిన 50 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. శ్రీకాళహస్తిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ముసలిపేడులో టీడీపీకి చెందిన మునస్వామి మహేష్, జగదీశ్, మునెమ్మ, రమణమ్మ, శారదమ్మ తదితరులకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నచ్చనేరి గ్రామంలోని టీడీపీకి చెందిన మధుసూదన్, నవీన్‌కుమార్, సుదర్శన్, రవీంద్ర, రాజయ్య, భాస్కర్, తరుణ్‌రెడ్డి, నవీన్, గోపాల్, డిల్లీబాబు, వెంకటాద్రి తదితరులకు ఎమ్మెల్యే కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ నాయకులు పవన్‌కుమార్, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక

ఏర్పేడు: మర్రిమందలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. గ్రామంలోని టీడీపీ సీనియర్ నాయకుడు తిరుపాల్, ఆయన అనుచరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి బియ్యపు పవిత్రారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మస్తాన్, గోపీ రాయల్, ఈశ్వర్, కృష్ణారెడ్డి, సుధీర్‌కుమార్, గెరటయ్య, లోకనాథరెడ్డి, మహేష్‌రెడ్డి, జీపీ యాదవ్, గురునాథం పాల్గొన్నారు.



టీడీపీ నాయకులకు కండువాలు వేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

సకాలంలో పెండింగ్ పనులు పూర్తి



ఐఐటీ, ఐసర్‌లో పెండింగ్ పనులపై సమీక్షిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్: కేంద్ర విద్యాసంస్థలు ఐఐటీ, ఐసర్‌లలో పెండింగ్ పనులు మార్చికి పూర్తయ్యేలా చర్యలు చేపడతామని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఐఐటీ, ఐసర్‌కు సంబంధించిన పలు అంశాలపై సోమవారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కే.ఎస్ జవహర్ రెడ్డి సంబంధిత కార్యదర్శులతో, అధికారులతో కలిసి కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించగా తిరుపతి కలెక్టరేట్ నుంచి తిరుపతి జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీ శ, జేసీ శుభం భన్సల్, ఐఐటీ, ఐసర్ సంస్థల ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ వివరిస్తూ ఐఐటీ, ఐసర్ విద్యాసంస్థలకు సంబంధించిన పెండింగ్ అంశాలను రానున్న మార్చి చివరికి పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. మరోవైపు ఐఐటీ, ఐసర్ ప్రతినిధులు మాట్లాడుతూ త్వరలోనే సమన్వయ సమావేశం నిర్వహించి బస్ షెల్టర్, వీధి దీపాలు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ తాగునీరు తదితర పెండింగ్ సమస్యలపై పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఐఐటీ, ఐసర్ ప్రతినిధులు, జి.సెక్షన్ సూపరింటెండెంట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ ద్రోహి చంద్రబాబు

వాకాడు: 14 ఏళ్లు పాటు రాష్ట్రాన్ని పరిపాలించిన చంద్రబాబు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని నిరుద్యోగ ద్రోహి అని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ విమర్శించారు. ఆయన సోమవారం మండలంలోని జానరపేట గ్రామంలో పర్యటించారు. దుగ్గరాజపట్నం ఓడరేవు రాకుండా అప్పట్లో చంద్రబాబు కేంద్రానికి లేఖ రాసి అడ్డుకున్నారని, దీనివల్ల నిరుద్యోగుల జీవితాల్లో మట్టికొట్టారని విమర్శించారు. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తపన పడుతున్నాడని, కానీ ప్రజలు ఆయన మాటలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ నెల 5నుంచి 15వ తేదీ వరకు 3 విడతల్లో ఒకేషనల్ విద్యార్థులకు, ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు రెండు విడతల్లో జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలను ఏర్పాటుచేశారు. ప్రతి రోజు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 138కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షలకు 22,454మంది హాజరుకానున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు 8 కేంద్రాల్లో 608 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాసినట్లు ఆర్ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

నేడు అవగాహన : ప్రాక్టికల్స్ మార్కుల నమోదుపై సైన్స్ టీచర్లకు మంగళవారం ఉదయం తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం ఉంటుందని ఆర్ఐఓ తెలిపారు. దీనికి మార్కుల ఎంట్రీ విధులు అప్పగించిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరవ్వాలని ఆయన కోరారు.